## క్లుప్తంగా

### మహిళా హోంగార్డుకు ఆర్థిక సాయం



కోనేరుసెంటర్:జిల్లా హోంగార్డు విభాగంలో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన మహిళ హోంగార్డు కె.కమలకు జిల్లాలోని హోంగార్డులు అంతా కలిసి సేకరించిన ఒకరోజు వేతనం రూ.3,94,050 చెక్కును జిల్లా ఎస్పీ పి.జాషువా సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విశిష్ట సేవలు అందించిన కమలకు అభినందనలు అని తెలిపారు. పదవి విరమణ పొందిన హోంగార్డులకు పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శాఖా పరంగా ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చిన ధైర్యంగా తనను కలవవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమాకు నేటితో గడువు ముగింపు

పెడన:వైఎస్సార్ బీమా నమోదుకు మంగళవారంతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఎవరైనా చేయించుకోవాల్సి ఉంటే తక్షణం బీమా నమోదు చేయించుకోవాలని పెడన మున్సిపల్ కమిషనర్ బి.మహేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లకార్డు దారులు వైఎస్సార్ బీమా చేయించుకోవడానికి అర్హులని, ఎవరైనా చేయించుకోవాలనుకుంటే తమ పరిధిలోని వలంటీరు చేత లేదా సమీపంలోని వార్డు సచివాలయంలో బీమా నమోదు చేయించుకోవాలన్నారు. బీమా చేయించుకోవడానికి తెల్లకార్డు, ఆధార్‌కార్డు తీసుకువెళ్లితే సరిపోతుందని పేర్కొన్నారు. అంతకు ముందు బీమా నమోదు చేయించుకున్న వారు తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు.

### పేర్లవానిలంకలో నేత్రదానం



గద్దం శేషగిరి(ఫైల్)

రేమాలవారిపాలెం(నాగాయలంక): పేర్లవానిలంక గ్రామంలో సోమవారం గద్దం శేషగిరి (65) మరణించగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. కుమారులు దేవచంద్రరాజు, కుమార్తె కరుణ ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకొచ్చారు. మత్తి రాజా ప్రోత్సాహంతో మండల నేత్రదాన మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.నారాయణ సహకరించారు. ఆసుపత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. మండలంలో వరుసగా రెండో రోజు నేత్రదానం జరగగా, గతంతో ఈ కుటుంబంలో దేవచంద్రరాజు తన మామ నేత్రాలను కూడా దానం చేశారు.

### విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్‌లు

అవనిగడ్డ:2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆర్టీసీ ద్వారా విద్యార్థులకు అందించే బస్ పాస్‌ల కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించినట్టు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. బాలికలకు పదో తరగతి వరకూ బాలురకు 12 సంవత్సరాల వరకూ ఉచిత బస్‌పాస్‌లు అందిస్తామని చెప్పారు. పాఠశాల నుంచి 20 కి.మీ దూరం వరకూ ఈ పాస్‌లు ఇస్తామన్నారు. ఉచిత బస్‌పాస్‌లు తీసుకునే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో పాటు రూ.50 నగదు చెల్లిస్తే పాస్‌లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అడ్మిషన్లు



మోపిదేవి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 6 నుంచి 10 వ తరగతిలో నూతనంగా సోమవారం 10 మంది విద్యార్థులు చేరినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయంతి తెలిపారు. హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్)లో కూడా 10 మంది చేరినట్లు పేర్కొన్నారు.

### వ్యక్తికి తీవ్ర గాయాలు

మోపిదేవి:ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మోపిదేవి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెంజర్తి వెంకటేశ్వరావు పెదకళ్లేపల్లి నుంచి వెంకటాపురం మీదగా మోపిదేవి వస్తుండగా బైక్‌పై నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలంకు చేరుకుని బాధితుడిని రావివారిపాలెం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

# ఉత్సాహంగా.. ఉల్లాసంగా స్కూళ్లకు..

- తొలిరోజే జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ
- నియోజకవర్గ వ్యాప్తంగా అందజేత
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

మచిలీపట్నంటౌన్:వేసవి సెలవులు అనంతరం సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా స్కూళ్లకు తరలివచ్చారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. వేసవి ఎండలు తగ్గకపోవటంతో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలు పనిచేశాయి. పై తరగతుల్లోకి వెళుతున్నామనే ఉత్సాహంతో ప్రతి ఒక్కరూ పాఠశాలకు వచ్చారు. పాఠశాల ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కిట్లలో ఇచ్చిన మూడు జతల బట్టలను సక్రమంగా కుట్టించుకోవాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రారంభమైన గంటకు విద్యార్థులకు రాగిజావ అందజేశారు. పాఠశాల సమయం ముగిసిన అనంతరం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. నగరంలోని పలు మునిసిపల్ పాఠశాలల్లో చేర్పించేందుకు వేరే పాఠశాలలకు చెందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు తీసుకురావటం కనిపించింది. చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆ స్కూల్ హెచ్‌ఎం వీవీవీ కనకదుర్గ విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను, రాగి జావ అందజేశారు. విద్యార్థులు జావ తాగేందుకు ప్రభుత్వం నుంచి వచ్చిన రాగి జావ పిండి, బెల్లం, గ్లాసులు ఎంతో నాణ్యంగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలలో చేరేందుకు వచ్చిన విద్యార్థులను ఆమెతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, సుధాకర్ స్వయంగా దరఖాస్తులు పూరించి జాయిన్ చేసుకున్నారు.



రైలుపేట మునిసిపల్ స్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో కార్పొరేటర్ గాజుల శ్రీదేవి



విశ్వనాథపల్లిలో జేవీకే కిట్లను అందిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు



చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో రాగిజావ తాగుతున్న విద్యార్థులు



రామకృష్ణాపురంలో కిట్లను అందిస్తున్న ఉపాధ్యాయులు



నాగాయలంకలో జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



భావదేవరపల్లిలో విద్యా కానుక కిట్లు అందిస్తున్న వైస్.ఎంపిపి, పీఏసీఎస్ అధ్యక్షుడు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక రైలుపేటలోని మునిసిపల్ స్కూల్‌లో చదువుతున్న 283 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేయటంతో పాటు ఇంగ్లిషు మీడియంను అమలు చేయటంతో విద్య ప్రమాణాలు పెరిగాయన్నారు. ఫలితంగా ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు మక్కువ చూపుతున్నారన్నారు. ఉదాహరణకు ఈ రైలుపేట స్కూల్‌లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకమునుపు ఐదో తరగతి వరకే ఉండేదని ఈ నాలుగేళ్లలో ప్రతి సంవత్సరం అప్‌గ్రేడ్ అవుతూ ఈ ఏడాది తొమ్మిదో తరగతి కూడా ఇక్కడ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్, 12వ డివిజన్ ఇన్‌చార్జ్ బందెల థామస్‌నోబుల్, పాఠశాల హెచ్‌ఎం చిన్నికృష్ణ పాల్గొన్నారు.

**జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ**

కోడూరు:పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కోడూరు చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ కిట్ల పంపిణీని ప్రారంభించారు. విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫారం, బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, సాక్స్‌లు, డిక్షనరీ, బెల్టును అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించేందుకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశచరిత్రలో నిలిచిపోతాయని జెడ్పీటీసీ, ఎంపీపీ అన్నారు. రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాలలో ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు జేవీకే కిట్లను విద్యార్థులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నాగాయలంక:మండలంలోని 51 పాఠశాలల్లో 3193 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ భోగాది రాఘవరాణి, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు విద్యార్థులకు సంబంధిత కిట్లు అందించారు. పదోతరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో అగ్రగామిగా నిలిచిన నాగాయలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందించారు. మండల విద్యాశాఖ అధికారి టివిఎం రామదాసు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని భావదేవరపల్లి జల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిశె అమ్మన్న, నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు (చంటి) అతిథులుగా హాజరై విద్యాకానుక కిట్లు అందించారు.

**బడులకు బయలుదేరిన బాలలు**

పెడన:వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. వారం రోజులు పాటు ఉదయం పూట మాత్రమే తెరవాలని విద్యాశాఖ ఆదేశాలతో సోమవారం బడులు తెరుచుకోవడంతో బాలలు బడులకు బయలుదేరారు. పెడన మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల, ఏడు ప్రాథమికోన్నత, 52 ప్రాథమిక పాఠశాలలతో పాటు రెండు మదరస్సాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వీటితో పాటు 15 ప్రైవేటు పాఠశాలలు సైతం తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీతో ఆయా పాఠశాలలు కోలాహలంగా మారాయి.

తోటమూల భట్టమోహనరావు హైమావతి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంఈవో కేఎస్‌వీప్రసాద్‌తో పాటు ఆ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. బంగ్లా స్కూల్లో వైఎస్సార్ సీపీ నాయకులు బళ్ల సాంబశివరావు, ఖాదర్‌జిలానీ, బాబులు అందజేయగా 6వ వార్డు ఉర్దూ స్కూల్లో ఆ వార్డు కౌన్సిలర్ బాబు లాల్ కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్న సీఎం జగన్

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్నారని ఎంపీపీ తుంగల సుమతీదేవి చెప్పారు. మండల పరిధిలోని వేకనూరు, అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్లో సోమవారం ఎంపీపీ, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎంఈవో ఎస్. శివశంకరరావు జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, ఎంపీటీసీ అవనిగడ్డ స్వర్ణకుమారి, వార్డు సభ్యులు పడమటి రాజ్యలక్ష్మీతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి

చల్లపల్లి: పేద కుటుంబాల్లో విద్యాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి అన్నారు. చల్లపల్లి జెడ్పీ హైస్కూల్, పురిటిగడ జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుకల కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, టై, బెల్ట్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ కరిముల్లా ఖాన్, హెచ్‌ఎంలు పద్మనాభరావు, కేబీఎస్ శర్మ పాల్గొన్నారు.

మోపిదేవి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి చేతుల మీదగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందచేశారు. కోసూరువారిపాలెం, నాగాయితిప్ప గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు కోసూరు అనూష, గరికిపాటి వెంకటేశ్వరావు (బుల్లి), విద్యార్థులకు కిట్లు అందించారు. ఎంఈవో కె. రాజ్ కుమార్, ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, విద్యాకమిటీ చైర్మన్లు రాధాకృష్ణ, లక్ష్మీకుమారి, హెచ్‌ఎం జయంతి, హెచ్‌ఎం కె. వీర రవి, చంద్రశేఖర్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



తోటమూల స్కూల్లో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంఈవో ప్రసాద్ తదితరులు



అవనిగడ్డలో జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ



మోపిదేవిలో జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లు అందిస్తున్న సర్పంచ్ మేరీరాణి



చల్లపల్లిలో విద్యా కానుక అందిస్తున్న జెడ్పీటీసీ కళ్యాణి తదితరులు

## అంకితభావంతో పని చేస్తే మంచి గుర్తింపు

చల్లపల్లి: విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసేవారికి మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కోట విజయ రాధిక అన్నారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ ఈఓ పడమట సుకుమార్ బందరు రూరల్ మండలం అరిసేపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సుకుమార్‌కు సన్మాన సభ జరిగింది. ఎంపీపీ విజయ రాధిక, తహసీల్దార్ కే.గోపాలకృష్ణ, ఎంపీడీఓ సీహెచ్.చినరాట్నాలు, సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఎస్ఐ సీహెచ్.చినబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ – డాక్టర్ తరిగోపుల పద్మావతి, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని తదితరులు సుకుమార్‌ను సన్మానించారు. డీటీ కుమార్, ఈఓపీఆర్డీ అశోక్, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది సత్కరించారు.చల్లపల్లి పంచాయతీ నుంచి లక్ష్మీపురం బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్ సంధ్యను సన్మానించారు.



సుకుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు

## పురుగు మందు తాగిన వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రిలో అరుదైన వైద్యం అందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని బ్రతికించిన ఘటన ఇది. బందరుకోటకు చెందిన డి.శ్రీనివాస్ ఆసుపత్రిలో అటెండరుగా పనిచేస్తున్నాడు. మే 31వ తేదీన పారాక్వాటు పురుగు మందు సేవించాడు. దీంతో అపస్మారక స్థితిలో చేరిన శ్రీనివాస్‌ను ఆసుపత్రిలో చేర్చగా ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ మెడిసన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాళి చంద్రశేఖర్ శ్రీనివాస్ కు మొదటి నుంచి వైద్యసేవలు అందించారు. శ్రీనివాస్ పూర్తి ఆరోగ్యంతో కోలుకోవటంతో సోమవారం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ సందర్భంగా వైద్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పారాక్వాటు పురుగు మందు తాగిన వ్యక్తులు దాదాపు మృతి చెందటం జరుగుతుందన్నారు. అయితే శ్రీనివాస్ మెరుగైన వైద్యం అందించటంతో బతికాడన్నారు.

## ● ప్రతిభకు పురస్కారం



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శ్రీ దివ్యకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మెమెంటో బహూకరిస్తున్న మంత్రి జోగి రమేష్, జేసీ అపరాజితా సింగ్ తదితరులు. –పెడన

## 15 నుంచి ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుడివాడ టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు మెరిట్ నంబర్ 01–59 వరకు, గ్రేడ్ పాయింట్లు 10.0 నుంచి 5.0 వరకు, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 60–96 మెరిట్ మార్కులు 4.9 నుంచి దిగువ గ్రేడ్ పాయింట్ల వరకు సాధించిన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. అడ్మిషన్ పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇతర కేటగిరి అభ్యర్థులు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాలన్నారు. మెరిట్ నంబర్ తెలుసుకునేందుకు గుడివాడలోని కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలోని హెల్ప్ డెస్క్‌లోను, 08674–295953, 8297574757, 8555952320 ఫోన్ నంబర్లలోనూ సంప్రదించాలని కోరారు. 10వ తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ అన్ని ఒరిజినల్స్‌తో హాజరుకావాలని సూచించారు.

## 55 మందికి వైద్య పరీక్షలు

పాగోలు(చల్లపల్లి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరంగా నిలుస్తోందని 104 డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కేఎస్ పెరుమాళ్లు అన్నారు. సోమవారం స్థానిక జగనన్న విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పెరుమాళ్లు పరిశీలించారు. శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ కె.విజయరావు, 55 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందచేశారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

బంటుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించారని సీడీపీవో సముద్రవేణి అన్నారు. మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసించిన ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఎంపీటీసీ తిరుమలశెట్టి లక్ష్మీతో కలసి అందచేశారు. ఏసీడీపీఓ సుధారాణి, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, వైద్య సిబ్బంది కమలరత్నం, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి అవసరం

గుడ్లవల్లేరు: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి అవసరమని నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి సీపాన శ్రీనివాసరావు అన్నారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో 'స్కిల్ అవేర్‌నెస్ కాంపెయిన్' అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లలోని స్కిల్ కాలేజీల్లో స్కిల్ అవేర్‌నెస్ కాంపెయిన్ నిర్వహించినట్లు తెలిపారు. చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహ కార్యదర్శి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్, డాక్టర్ పి.రవీంద్రబాబు తదితరులున్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

**డీఎస్పీ శ్రీకాంత్**

గుడివాడ టౌన్: మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని గుడివాడ డీఎస్పీ పీ శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తుందన్నారు. డ్రగ్స్ వాడటం వలన యువత విచక్షణ కోల్పోతున్నారని తెలిపారు. ఏంచేస్తున్నారో తెలియని స్థితిలో నేరాలకు పాల్పడటం, వేగంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు మనో వేదన మిగులుస్తున్నారని చెప్పారు. ప్రత్యేకించి 15 నుంచి 25 ఏళ్ల లోపువారే మాదక ద్రవ్యాలకు దగ్గర అవుతున్నారన్నారు. యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు సరఫరా, అమ్మకం, భద్రపర్చడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సమాచారం తెలిసిన వారు తోటి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసులకు 14500 లేదా 100లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ తులసీధర్, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, బీఎస్ఎస్ పద్మజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.